# జోగి... జోగి...

టి. రాంరెడ్డి

"యీ దినం సాయంత్రం సరిగ్గా ఆరుగంటల యిరవై నిమిషాలకు పబ్లిక్ గార్డెన్స్‌లో కుడిప్రక్క నున్న కొబ్బరిచెట్లక్రింద సిమెంటు బెంచీ దగ్గరకు మీరు సంకోచం లేకుండా రావలసింది. నా చేతిలో, సరిగ్గా ఆరుగంటల యిరవై నిమిషాలకు, ఎర్రగులాబీ పట్టుకుని కూర్చుంటాను. మీతో ఎన్నో విషయాలు మాట్లాడాలి.

"అరుణ"

కుటుంబరావు ఉత్తరాన్ని మరోసారి చదివి జేబులో వేసుకున్నాడు. యిన్ని దినాలుగా తాను చేయలేని ధైర్యం, తెగువా ఆమే చేస్తోంది... ఆశ్చర్యమే! దాదాపు మూడునెలలుగా తమ ఇద్దరిమధ్యలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి...

... అరుణా నన్ను క్షమించగలవు... యీ మూడు నెలలనుండీ నేను చేసింది సాహసమే! ఒప్పుకుంటాను... కాని యిదంతా కేవలం నీ కరుణాకటాక్ష వీక్షణాల కోసమే! నాలుగు పేజీల ఉత్తరం తాను వ్రాసింది ఒకసారి సరిచూసుకున్నాడు; క్రింద సంతకం "కరుణ" అని చేశాడు.

తా నీ మోసం చేయాలని చేయలేదు... కాలం పత్రికలో ఆమె పేరు చూసి ఆమె పరిచయం కోసమే అమ్మాయి పేరుతో ఉత్తరాలు వ్రాశాడు. ఆమె ఇవాళ అంతగా అరిస్తే, యీ నాలుగు పేజీల ఉత్తరాన్నీ ఆమె ముందుంచి, తల వంచితే సరి. ఆమె అంత నిర్దయురాలా! ఆడవాళ్ళ హృదయాలు సున్నితాలు కావూ!

జనం కబుర్లు చెప్పుకుంటూ గుంపులు గుంపులుగా గార్డెన్ నిండా తిరుగుతున్నారు... కుటుంబరావు విసుగ్గా వాచీ చూసుకున్నాడు... ఆరుగంటలు! ఆ కుడిప్రక్క కొబ్బరిచెట్టుక్రింద సిమెంటు బెంచీమీద ఎవడో తెల్లడ్రెస్సువాడు అదేపనిగా పేపరు చదువుకుంటున్నాడు... ఎక్కడా స్థలం లేనట్టు!

అయినా ఇలాంటి వ్యవహారాలకు పబ్లిక్ గార్డెన్‌లు పనికిరావు... అరుణ ఆ మాత్రం ఆలోచించ లేకపోయింది. ఆరుగంటల పదినిమిషాలకు కుటుంబరావులో సహనం పూర్తిగా నశించిపోయింది. పోయి తెల్లడ్రెస్సువాని ప్రక్కనే నుంచున్నాడు... వా డెంతకూ లేవడే!

కుటుంబరావు విసుక్కుంటూ మాటిమాటికీ చేతి గడియారం చూసుకుంటున్నాడు. సరిగ్గా ఆరు గంటల ఇరవై నిమిషాలకు తెల్లడ్రెస్సువాడు పత్రిక ప్రక్కన పడేసి జేబులోనుండి ఎర్రగులాబీ తీసి రేకులు పరిశీలిస్తూ కూర్చున్నాడు...

కుటుంబరావు నిర్ఘాంతపోయాడు.